క్లుప్తంగా

పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలి

పెర్కిట్: ఆర్మూర్ మండలంలో మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గోవింద్‌పేట్ పీహెచ్‌సీ వైద్యాధికారి మానస సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని గోవింద్‌పేట్, మామిడిపల్లి, పెర్కిట్ ఆరోగ్య ఉప కేంద్రాల్లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, శ్యామల, ఎస్తేరు రాణి, గణేష్, అరుణ, కవిత, విజయ పాల్గొన్నారు.

పశువుల పెంపకంపై అవగాహన

మాక్లూర్: రైతులు గడ్డి జాతుల గేదెలను పెంచుకోవాలని పశు వైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే సూచించారు. బుధవారం మండలంలోని అమ్రాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో పశువుల పెంపకంపై అవగాహన కల్పించారు. ఇంటి వద్దే మేత వేస్తూ పెంచే గేదెలు ఎక్కువకాలం పాలను అందించలేవన్నారు. గడ్డి జాతి గేదెలను బయటకు మేతకు తీసుకెళ్లి ఇంటి వద్ద కొద్ది పాటి తౌడుతో కూడిన కుడితి అందిస్తే లీటర్ల కొద్ది పాలు అందిస్తాయన్నారు. నందిపేట పశువైద్యాధికారి హన్మంత్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ రామకృష్ణ, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పాలెపు చిన్న గంగారాం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. చికిత్సకు ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుండడంతో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డిని సంప్రదించగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 1.15 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) మంజూరు చేయించారు. మంజూరు పత్రాన్ని బుధవారం బాధితుడికి అందజేశారు.

మహాసభలను విజయవంతం చేయాలి

రెంజల్: ఖమ్మం జిల్లాలో మార్చి 3 నుంచి నిర్వహించే విప్లవ పార్టీల జాతీయ ఐక్యత మహాసభలను విజయవంతం చేయాలని మండల రైతుకూలీ సంఘం నాయకులు కోరారు. మహాసభల పోస్టర్లను బుధవారం మండలంలోని బోర్గాం గ్రామంలో ఆవిష్కరించారు. పుట్టి నాగన్న, రాజేశ్వర్, నసీర్, హైమద్, పోశెట్టి, గోపాల్ పాల్గొన్నారు.

మసీదు పరిసరాలను శుభ్రం చేయాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని మసీదు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని ప్రెసిడెంట్ ఆల్ ఇండియా మజ్లిస్ ఇత్తహాదుల్ ముస్లిం ఆర్మూర్ అధ్యక్షుడు జహీర్ అలీ అన్నారు. మార్చి 12 నుంచి రంజాన్ మాసం ప్రారంభమవుతుందని, నెల రోజుల పాటు మసీదుకు నీటి సౌకర్యం కల్పించారు. ఈనెల 25న షబ్ ఏ భారత్‌లో భాగంగా రాత్రి సమయంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తామన్నారు.

కులగణన తీర్మానంపై హర్షం

రుద్రూర్: అసెంబ్లీలో బీసీ సమగ్ర కుల గణన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాస్ రాము లు అన్నారు. కోటగిరిలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు బుధవారం మాట్లాడారు. నాయకులు వై ఓమయ్య, విఠల్ గౌడ్, నల్లగంగాధర్, సోమ రాములు, శివ రాజ్, హన్మాండ్లు, గిర్మవ్వ, లక్ష్మి పాల్గొన్నారు.

మాతృభాషా దినోత్సవం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలోని శ్రీవిద్యాసాయి, కృష్ణవేణి హైస్కూళ్లలో బుధవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మాతృ భాష ప్రాముఖ్యతను వివరించారు. శ్రీవిద్యాసాయి కరస్పాండెంట్ గంగారెడ్డి, కృష్ణవేణి ప్రిన్సిపాల్ గంగాప్రసాద్ పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ మండలంలోని కోమన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్యపఠన పోటీలు నిర్వహించారు. అనంతరం కవి మహేషబాబుకు సన్మానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం కవిత, వినోద్‌కుమార్, చిన్నయ్య, సాయన్న, వినోద్, భగవంతరావ్ గోపాల్, జయశ్రీ, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి

వర్ని(మోస్రా): బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులందరికీ పెరిగిన కరువు భత్యాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మోస్రా మండలంలోని చింతకుంట, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆయన మాట్లాడారు. గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు పెరిగిన ధరలకు అనుగుణంగా బీడీలు చుట్టే వారికి వేతనాలు చెల్లించాలని కోరారు. లేకుంటేట కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నేతలు ఎం శ్రీనివాస్, పద్మ, విజయ, గంగమణి, సత్యవ్వ, వాణి, లక్ష్మి పాల్గొన్నారు.

మృత్యు మలుపులు

- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


వల్లభాపూర్‌లో ప్రమాదకరంగా మలుపు


చిన్నాపూర్ గండిలో 63వ జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మాక్లూర్: మాక్లూర్ మండలంలోని పలు మార్గాల్లో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలో 63వ నంబర్ జాతీయ రహదారి చిన్నాపూర్ గండిలో మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే చిక్లి శివారులో ఉన్న మూల మలుపు దగ్గర గతంలో వల్లభాపూర్‌కు చెందిన సాగర్ అనే యువకుడు బైక్ అదుపుతప్పి మృతి చెందాడు. అంతే కాకుండా అక్కడ ఇప్పటికీ పలువురు వాహనదారులు అదుపు తప్పి పడి గాయాల పాలవుతున్నారు. గాలిబ్‌నగర్ నుంచి కల్లెడి వెళ్లే మార్గంలో మలుపు వద్ద సైతం ప్రమాదాలు జరుగుతున్నాయి. వల్లభాపూర్ గ్రామ చివరిలో కూడా అతి ప్రమాదకరమైన మలుపు ఉంది. ఇక్కడ అనేక సార్లు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ధర్మోరా రహదారి మాంధాపూర్, గొట్టిముక్కల శివారులలోని మూల మలుపులతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కల్లెడి రహదారిపై..

చర్యలు చేపట్టాలి



మా గ్రామ చివరిలో జన్నేపల్లి మార్గంలో ప్రమాదకర మూల మలుపు ఉంది. ఇక్కడ ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. ఇక్కడ ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలి.

– బి ప్రభాకర్, వల్లభాపూర్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

నవీపేట: మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో యూబీఐ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రుణమేళాలో ఆయన మాట్లాడారు. మహిళలను ఆర్థికంగా చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతోనే 18 ఏళ్ల కిందటనే కాంగ్రెస్ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రూపకల్పన చేసిందన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి మరిన్ని రుణాలను పొందాలని సూచించారు. కేసీఆర్ హయాంలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, గాడిలో పెట్టేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. యూబీఐ డీజీఎం శంకర్ హేమ్‌రామ్, ఏజీఎం శివకోటయ్య, డీఆర్‌డీఏ ఏపీడీ రవీందర్, డీపీఎం నీలిమా కులకర్ణి, ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, ఎంపీడీవో నాగనాథ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు

మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాలకు పుష్పాభిషేకం చేశారు. మానాల మోహన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, గోవర్ధన్ రెడ్డి, సాయరెడ్డి, గోపాల్, బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రెంజల్: రెంజల్ విండో డైరెక్టర్ అగ్గు నారాయణ, డీలర్ ప్రభాకర్ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరిద్దరి చేరికతో రెంజల్ విండో చైర్మన్‌పై అవిశ్వాసానికి బలం చేకూరినట్లైంది. నాయకులు మొబిన్‌ఖాన్, సాయరెడ్డి, ధనుంజయ్, సాయిబాబగౌడ్, కుర్మె శ్రీనివాస్, జావీద్, హన్మంత్‌రావ్, పోచయ్య, షౌకత్ ఉన్నారు.

ఎడపల్లి: మండలంలోని తాడెంకు చెందిన మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోశాని గంగాధర్, బీజేపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వారిని ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీనివాస్, మనోజ్, అబ్బయ్య, ముత్యం, లింగారెడ్డి, నరేందర్ ఉన్నారు.

మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

రుద్రూర్: సంక్షేమ హాస్టళ్లకు మెస్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్ డిమాండ్ చేశారు. కోటగిరి మండలంలోని సంక్షేమ హాస్టళ్లను బుధవారం వారు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఏడు నెలలుగా ప్రభుత్వం మెస్ బిల్లులు విడుదల చేయలేదని, దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి వార్డెన్‌లు అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోందన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. అనంతరం స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కమిటీలు ఏర్పాటు చేశారు. బోధన్ డివిజన్ కార్యదర్శి సాయికుమార్, శ్రీకాంత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ఆధ్యాత్మికం..

ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం



మాక్లూర్: మండలంలోని ముల్లంగి (బి) శివారులో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం అంగరంగా వైభవంగా రాధ, వేణుగోపాల స్వామి కల్యాణోత్సవం జరిగింది. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

మాక్లూర్: మండలంలోని అడవి మామిడిపల్లి శివారులో ఉన్న అపురూప వేంకటేశ్వర ఆలయంలో ఈ నెల 22 (గురువారం) నుంచి 29 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్ పర్సన్ అమృతలత బుధవారం తెలిపారు. ఆలయంలో పూజ కార్యక్రమాలతో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో రోజుకో విధమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

ఎడపల్లి: మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 25 వరకు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో బుధవారం శాల ప్రతిష్ఠ, వాస్తు హోమం, ధ్వజారోహణం యజ్ఞం నిర్వహించారు. శ్రీ వనరాజు శర్మ, రాజేష్‌శర్మ, చిలక నరసయ్య, గంగకిశోర్, చిలక రవి, లక్ష్మణ్, తాహెర్ పాల్గొన్నారు. గురువారం సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు సిబ్బంది తెలిపారు.



ఉజ్వల భవిష్యత్తు కోసం సిద్ధం కావాలి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తానా

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు ఇప్పటి నుంచి ఉజ్వల భవిష్యత్తు కోసం సిద్ధం కావాలని ఆర్మూర్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తానా అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఫోన్‌లలో కాలం గడపకుండా పుస్తకాలతో కుస్తీ పట్టాలన్నారు. ఆర్మూర్ ఏసీపీ బస్వరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం వనజ పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ పార్టీ



రెంజల్: రెంజల్‌లోని ఆదర్శ పాఠశాలలో బుధవారం ఫేర్‌వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎంఈవో గణేశ్‌రావు, ప్రిన్సిపాల్ బలరాం, సోమలింగంగౌడ్, సాయరెడ్డి, నోడల్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

శ్రీభాషిత కాలేజీలో..



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలోని శ్రీభాషిత జూనియర్ కాలేజీలో బుధవారం ఫేర్‌వెల్ ప్రోగ్రామ్ జోష్‌గా సాగింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు పలికారు. కళాశాల డైరెక్టర్లు సుంకెట రవి, రాజశేఖర్, సంజీవ్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బాల్కొండ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్లాజా ఫంక్షన్ హాల్‌లో ఆర్మూర్ ప్రభుత్వ బాలుర కాలేజీ వీడ్కోలు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు స్వర్ణ, రవి, సుభాష్, చంద్రశేఖర్, చంద్రమోహన్, శ్రీనివాస్, లక్ష్మణ్ సురేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

మందులు అందుబాటులో ఉంచాలి

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తోండ ఆరోగ్య ఉపకేంద్రాన్ని బుధవారం మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ తనిఖీ చేశారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు ఇచ్చే టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. మందుల కొరత రాకుండా అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

విహార యాత్రలో విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని స్మైల్స్ ది స్కూల్ పాఠశాల విద్యార్థులు బుధవారం విహార యాత్రలో భాగంగా మాక్లూర్ మండలం గుత్ప అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి పంటల గురించి తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ రఫీ గోహార్, డైరెక్టర్ షబానా గోహార్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

రెంజల్: మండలంలోని కల్యాపూర్, కందకుర్తి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయా గ్రామాల బీజేపీ నాయకులు బుధవారం బ్యాగులను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓఎన్‌జీసీ ద్వార ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు బ్యాగులు సరఫరా చేసిందని పేర్కొన్నారు. మేక సంతోష్, గాండ్ల నాగరాజు, యోగేష్, అసద్‌బేగ్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మీ–సేవ కేంద్రాల సమస్యల్ని పరిష్కరించాలి

పెర్కిట్: మీ–సేవ కేంద్రాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బుధవారం ఆర్డీవో వినోద్ కుమార్‌ను మీ–సేవ యూనియన్ నాయకులు కోరారు. మీ–సేవ కేంద్రాలకు కమీషన్ నెలకు రూ.2వేలు కూడా రావడం లేదన్నారు. కమీషన్ పెంచాలని కోరారు. నరేష్, మీరా శ్రవణ్, రాజు, సురేస్, బాలిక సాబేర్, స్వప్న పాల్గొన్నారు.

మసీదుల అభివృద్ధికి నిధులు

నందిపేట్(ఆర్మూర్): ఆంధ్రానగర్, సీహెచ్ కొండూరు గ్రామాలలోని మసీదుల అభివృద్ధికి రూ.2 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మజీద్ కమిటీ సభ్యులకు చెక్కులను అందజేశారు. నందిపేట్ నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ రావును మండల ముస్లిం కమిటీ అధ్యక్షులు షేక్ ఖలీం హైమద్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు సన్మానించారు. కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు డాక్టర్ హైమద్ పాల్గొన్నారు.

ఆర్మూర్ ఏసీపీకి సన్మానం

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ ఏసీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బసవరెడ్డిని బీజేపీ నాయకులు బుధవారం సన్మానించారు. దోండి ప్రకాష్, పుప్పాల పోశెట్టి, విజయ్, సంపత్ కుమార్, కౌశిక్ పాల్గొన్నారు

వేల్పూర్: వేల్పూర్ మండలం అంక్సాపూర్‌కు చెందిన రైతు నాయకుడు దేగాం రాములు బుధవారం ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డిని సన్మానించారు. ఫతేపూర్ సాయన్న ఉన్నారు.

మాజీ స్పీకర్ వ్యాఖ్యలు సరికాదు

వర్ని: మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఒక హోదాలో ఉండి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎలమంచిలి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం వర్నిలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయి కేసీఆర్ సీఎం అవుతారని పోచారం శ్రీనివాస్ రెడ్డి అనడం సరికాదన్నారు.

ఈ కార్యక్రమంలో సురేష్ బాబా, దశరథ్, రెడ్డి రాంబాబు, గంగప్ప, దామినేని నాగేశ్వరరావు, గంగా ప్రసాద్, ప్రశాంత్ పటేల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వృథా

- ఎంపీ అర్వింద్


మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

బాల్కొండ: రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం బాల్కొండలో నియోజక వర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్డీఏ 400 ఎంపీ సీట్లతో అధికారంలోకి వస్తుందన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు చేసిన ఘనత బీజేపీదే అన్నారు. నిజామాబాద్‌కు వచ్చి పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటన చేసిన ప్రధానికి ఎక్కడ పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలో తెలియదా అన్నారు. రాజకీయాల కోసమే కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పసుపు బోర్డు ఏర్పాటుతోనే ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలకు రూ.14 వేల ధర పలుకుతుందన్నారు. అర్వింద్‌కు అహంకారం అంటూ కాంగ్రెస్ నాయకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావొస్తున్న ఆరు గ్యారంటీల ఊసే లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మల్లికార్జున్‌రెడ్డి, గద్దె భూమన్న, వెంకటరమణ, నిమ్మల శ్రీనివాస్, అంబటి నవీన్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

భీమ్‌గల్: సీనియర్ నాయకుడు, మెండోర ఎంపీటీసీ భర్త ఆరే రవీందర్ సుమారు 50 మందితో కలిసి బుధవారం బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ అర్వింద్ సమక్షంలో పార్టీలో చేరారు. చేరిన వారిలో తక్కురి అంజయ్య, పార్వతి శ్రీనివాస్, బాబురావు, రవి, నర్సింగ్, సునీల్, రమేష్, గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, ప్రదీప్, గణపతి, వెంకన్న తదితరులు ఉన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు అభినందనీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

భీమ్‌గల్: తమ ప్రభుత్వం హయాంలో సేవాలాల్ మహరాజ్ జయంతి అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకొంటే ఈ ప్రభుత్వం దానిని కొనసాగిస్తూనే ఆయన జయంతి రోజు సెలవు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. భీమ్‌గల్ బంజారా భవన్‌లో బుధవారం జరిగిన సేవాలాల్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారాల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో 50 లక్షలతో ఎక్కడ లేనట్టుగా బంజారా భవన్ లు నిర్మించామని చెప్పారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కొనసాగించాలన్నారు. జెడ్పీటీసీ రవి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయకపోతే శిక్ష తప్పదు


మాట్లాడుతున్న డీఎల్‌పీవో సాయిబాబా

వర్ని: పంచాయతీ కార్యదర్శులు పనిచేయకపోయినా, రాజకీయాలకు పాల్పడినా శిక్ష తప్పదని డీఎల్‌పీవో సాయిబాబా హెచ్చరించారు. బుధవారం వర్ని మండల కేంద్రంలో చందూర్ , మోస్రా, వర్ని, రుద్రూర్, కోటగిరి మండలాలకు చెందిన కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎంపీవోలు చందర్‌నాయక్, సాయిలు, మారుతి, తారాచంద్, రఫీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్ని(మోస్రా): మోస్రా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను బుధవారం డీఎల్‌పీవో సాయిబాబా పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలన్నారు. నూతనంగా వచ్చిన డీఎల్‌పీవోను పంచాయతీ సిబ్బంది సన్మానించారు.

గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

వర్ని: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వర్నిలో మోస్ర, చందూర్, రుద్రూర్, వర్ని మండలాలకు చెందిన 156 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతా హామీలన్నీ అమలు చేయడంలో శ్రద్ధ చూపటం లేదన్నారు. ఆర్డీవో రాజాగౌడ్, జెడ్పీటీసీలు హరిదాసు, నారోజీ గంగారాం, నాయకులు పిట్ల రాములు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



డొంకేశ్వర్‌లో పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, జాన్కంపేటలో..

డొంకేశ్వర్/వేల్పూర్/పెర్కిట్/నందిపేట్: శాసనసభలో బీసీ సమగ్ర కుల గణన తీర్మానాన్ని ఆమోదించడంతో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పలు గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీఎం నిర్ణయంతో బీసీలకు మేలు జరుగుతుందన్నారు.

సమాచారం..

నేడు ఇసుక నిల్వలకు వేలం

రెంజల్: నీలా, పేపర్‌మిల్ గ్రామాల నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఇసుకకు గురువారం తహసీల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఖలీం తెలిపారు. రెంజల్ తహసీల్ కార్యాలయం వద్ద రెండు ట్రాక్టర్లు, పేపర్‌మిల్ శివారులో మూడు టిప్పర్ల ఇసుక నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. రెండు ట్రాక్టర్ల ఇసుకకు రూ.3 వేలు, మూడు టిప్పర్ల ఇసుకకు రూ.20 వేల ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

ఎమ్మెల్యే పర్యటన

రెంజల్: కూనేపల్లి కళ్యాపూర్, బాగేపల్లి గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పర్యటిస్తారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మొబిన్‌ఖాన్ తెలిపారు. ఆయా గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కరించే చర్యలు తీసుకుంటారని వివరించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రాజధాని ఫైల్స్ (తెలుగు) – 01.00 మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 4.20, 7.00, 9.40
స్క్రీన్-2 –	ఈగల్ (తెలుగు) – 11.30, 03.00, 6.30, 9.50
స్క్రీన్-3 –	ఊరు పేరు భైరవ కోన(తెలుగు) – 1.00, 4.00, 07.00, 10.00
స్క్రీన్-4 –	మేడమ్ వెబ్(ఇంగ్లీష్)- 12.15 హనుమాన్ (తెలుగు) – 3.30, 6.50 ఓయ్(తెలుగు) – 10.10